ప్రజాశక్తి
బుధవారం 5 నవంబర్ 2025
5
విజయనగరం



కంపించిన భూమి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలోని విజయనగరం పట్టణం, మండల పరిధిలో మంగళవారం వేకువ జామున 4:18 గంటలకు భూమి కొన్ని సెకండ్ల పాటు కంపించింది. ఈ సమయంలో మేల్కొన్న వారు ఈ విషయాన్ని గమనించారు. కాల కృత్యాలకు వెళ్లిన వారు, టీ తాగేందుకు లేచిన వారు భూమి కంపించినట్లు గుర్తించారు. తాజాగా విజయనగరంలోని ఆర్అండ్‌బి జంక్షన్, కెఎల్ పురం, విటి అగ్రహారం ప్రాంతాల్లోను, విజయనగరం మండల పరిధిలో ముడిదాం, అంబటి వలస, చెల్లూరు తదితర గ్రామాల్లో కూడా భూమి కనిపించినట్లు ప్రజలు తెలిపారు

అన్ని పనులకూ ఒక్కడే..

పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాల్సిన సాంఘిక సంక్షేమ హాస్టళ్లు కనీస మౌలిక వసతులు లేక దయనీయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. ఎన్నో ఆశలతో వసతి గృహాల్లో చేరుతున్న వీరంతా మంచాలు లేక కటిక చలిలో నేలపై నిద్రించాల్సిన దయనీయ స్థితి నెలకొంటోంది. శుభ్రత లేని బాత్రూములు కారణంగా విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని హాస్టల్స్‌కు సొంత భవనాలు లేక అద్దె భవనాలే దిక్కుగా ఉన్నాయి. 70మంది విద్యార్థులున్న ఎస్‌సి బాలుర కళాశాలల హాస్టల్‌లో కుక్, వాచ్‌మేన్, స్వీపర్ విధులు ఒక్కరే నిర్వహించడం చూస్తే సంక్షేమ హాస్టళ్ల దుస్థితికి అద్దం పడుతోంది. గిరిజన బాలుర కళాశాల హాస్టల్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.



అద్దె భవనంలో నడుస్తున్న గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహం

- ఒక్కరితోనే వంట , వాచ్‌మేన్, స్వీపర్ పనులు
- సంక్షేమ వసతి గృహాల్లో వసతులు కరువు
- సిబ్బంది కొరత, పర్యవేక్షణ లోపం
- వ్యసనాలకు బానిసలవుతున్న విద్యార్థులు


ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరం మండల వ్యాప్తంగా ఎస్‌సి బాలురు, ఎస్‌సి బాలికలు, ఎస్‌టి బాలురు, ఎస్‌టి బాలికలు, బిసి బాలురు, బాలికల సంక్షేమ హాస్టళ్లు ఎనిమిది వరకు ఉన్నాయి. ఒక్కో హాస్టల్‌లో కనీసం 50 మంది విద్యార్థులు ఉన్నారు. వీటిలో చాలా వరకు హాస్టల్స్ సొంత భవనాలు లేక అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ఏ హాస్టల్‌లోనూ మెనూ అమలు కావడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా పేద పిల్లల మౌలిక వసతులపై దృష్టి సారించడం లేదని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు అంటున్నాయి. గతనెల బిసి హాస్టళ్లకు కూరగాయల బిల్లులు చెల్లించకపోవడంతో వార్డెన్‌లపై ఆర్థిక భారం పడుతోంది. ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్న లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి.

నేలపైనే నిద్ర

బిసి బాలుర హాస్టల్‌లో చెక్క మంచాలు ఉన్నప్పటికీ వాటిపై పరుపులు లేక సుఖాంతమైన నిద్రలేకుండా పోతుందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఎస్‌సి, బిసి, ఎస్‌టి ఇంటర్ హాస్టళ్లలో మంచాలు, బెడ్లు లేవు. కనీసం ప్రభుత్వం తరపున చాపలు కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. దీంతో కొంతమంది విద్యార్థులు చలిలో నేలపైనే పడుకోవాల్సి వస్తోంది.

అధ్వానంగా మరుగుదొడ్లు



తలుపులు లేని ఎస్‌సి హాస్టల్ బాత్‌రూమ్‌లు

మరుగుదొడ్లు నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో అవి అపరిశుభ్రంగా మారిపోయాయి. ఫలితంగా కొంతమంది విద్యార్థులు బహిర్భూమికి బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొన్నిచోట్ల డోర్లు సరిగ్గా పడక వినియోగించలేని పరిస్థితి ఉంది.

బిల్లులు ఎగవేత

గత నెలలో కూరగాయలు బిల్లులు చెల్లించకపోవడం, డైట్ చార్జీలు 2023 తర్వాత పెంచకపోవడంతో వసతిగృహ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో విద్యార్థిపై నెలకు రూ.1600 మాత్రమే మెస్ ఛార్జీ చెల్లించడంతో మెనూకు తగినట్లు నాణ్యమైన భోజనం అందడం లేదు.

సిబ్బంది కొరత - పర్యవేక్షణ లోపం

చాలా చోట్ల క్లాస్ 4 సిబ్బంది కొరత ఉండటంతో పదుల సంఖ్యలో ఉన్న విద్యార్థులకు ఒకే వ్యక్తి అన్ని తానై చేస్తున్న పరిస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల సిబ్బంది ఉన్నప్పటికీ సరైన సమయపాలన పాటించకపోవడంతో పర్యవేక్షణ కరువైంది. దీంతో కొంతమంది విద్యార్థులు చదువుకు డుమ్మా కొట్టి చెడు వ్యసనాలకు బానిసలవు తున్నారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి



సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న దయ నీయ పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. విద్యార్థుల కోసం తగినన్ని నిధులు కేటాయించి, మౌలిక వసతులు కల్పించాలి. సొంత భవనాలు నిర్మాణం, మంచాలు, దుప్పట్లు, మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు, క్లాస్ ఫోర్ సిబ్బందిని తప్పనిసరిగా నియమించాలి. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని హాస్టల్స్‌లో మౌలిక వసతులు కల్పించాలి.

డి.రాము,
ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్

ధాన్యం సేకరణకు సిద్ధం

- ఖరీఫ్ సేకరణ లక్ష్యం 4 లక్షల మెట్రిక్ టన్నులు
- కనీస మద్దతు ధర క్వింటాకు కామన్ వెరైటీ రూ.2369, గ్రేడ్ ఎ రూ.2389
- జిల్లాలో 382 కొనుగోలు కేంద్రాలు
- 1967 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు
- సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్

ప్రజాశక్తి -విజయనగరంకోట, కంటోన్మెంట్

ఖరీఫ్ ధాన్యం సేకరణకు యంత్రాంగమంతా సిద్ధంగా ఉండాలని సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్ తెలిపారు. ఈ ఏడాది 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. కనీస మద్దతు ధర క్వింటాకు -కామన్ వెరైటీ రూ.2369, గ్రేడ్ -ఎ రూ.2389గా ఉంటుందని, ఇది గత ఏడాది కంటే 69 రుపాయలు ఎక్కువని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ధాన్యం సేకరణపై సంబంధిత అధికారులు, సిబ్బందితో జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ధాన్యం సేకరణకు జిల్లాలో 382 కొనుగోలు కేంద్రాలను , 261 క్లస్టర్లను ఎబిసి లుగా వర్గీకరించినట్లు తెలిపారు. జిల్లాకు ఒక కోటి గోనె సంచులు అవసరం అవుతాయని, 50 లక్షల వరకు అందుబాటులో ఉన్నాయని, మిగిలిన వాటిని సేకరించవలసి ఉంటుందని అన్నారు. 159 మిల్లులను గుర్తించామని, వాటి సామర్థ్యాన్ని బట్టి ధాన్యం సిద్ధం చేయవలసి ఉంటుందని తెలిపారు. నవంబర్ 2వ వారం నుండి సేకరణ కేంద్రాలు ప్రారంభం అవుతాయని, చెక్ పోస్టుల వద్ద గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని ఆర్‌డిఒలకు సూచించారు. చెల్లింపులు 48 గంటల్లోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా స్థాయి లో 89789 75284 కాంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని,మండల స్థాయి లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ధాన్యం సేకరణపై 1967 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బి.శాంతి, ఆర్‌డిఒలు కీర్తి, రామ్మోహన్ , సత్య వాణి , జిల్లా పౌర సరఫరాల అధికారి మురళీ, డిసిఒ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామా రావు, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ , మార్క్‌ఫెడ్ డిఎం వెంకటేశ్వర రావు , మార్కెటింగ్ ఎడి రవి కిరణ్ , తహశీల్దార్లు, ఎంపిడిఒ లు, ట్రాన్స్‌పోర్టు, లీగల్ మెట్రోలజి అధికారులు, డిటిలు, విఆర్ఒలు పాల్గొన్నారు.

రూ.55కోట్లతో 109 చెరువుల అభివృద్ధి

ఆర్ఆర్ఆర్ కింద ప్రతిపాదనలు : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం ఇరిగేషన్ డివిజన్ పరిధిలోని 109 మైనర్ ఇరిగేషన్ చెరువులను సుమారు రూ.55 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. చిన్నతరహా నీటిపారుదల చెరువుల అభివృద్ధిపై తమ ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ (రిపేర్స్, రెస్టోరేషన్, రెన్నోవేషన్) కింద డివిజన్‌లో మొదటి విడత 44, రెండో విడత 49, తాజాగా మూడోవిడతలో 16 చెరువులను ప్రతిపాదించినట్లు తెలిపారు. మొత్తం ఐదు నియోజకవర్గాల్లోని 19 మండలాల్లో ఈ చెరువులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఈ 109 చెరువుల అభివద్ధికి అనుమతి రాగానే, పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ పి.అప్పలనాయుడు, ఇఇ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత, డ్వామా పీడీ శారదాదేవి, ఇతర ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

నీట్ విద్యార్థులకు ఉచిత కోచింగ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నీట్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి కె. మాణిక్యం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, హాస్టల్స్ లో 2023-24, 2024-25 లో చదువుకున్న విద్యార్థులకు, నీట్ పరీక్షకు హాజరైన వారు లాంగ్ టర్మ్ కోచింగ్ కావాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు కోచింగ్ సెంటర్ లో పూర్తిగా ఉచిత వసతి, భోజన సదుపాయాలతో అంబేద్కర్ స్టడీ సర్కిల్ విజయవాడలో ఈ కోచింగ్ ఇస్తారని తెలిపారు. అంబేద్కర్ స్టడీ సర్కిల్ విజయవాడ (7569226400 శాస్త్రి గారు) సంప్రదించాలని తెలిపారు. ఏమైనా సందేహాలకు 7995562113, 9951120330 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

వచ్చేనెల 13న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి-విజయనగరంకోట

డిసెంబర్ 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత కోరారు. విజయనగరం జిల్లా కోర్టు పరిధిలో ఉన్న న్యాయమూర్తులతో నేరుగా, మన్యంజిల్లాలోని న్యాయమూర్తులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద భీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు మరియు ఎగ్జిక్యూషన్ పిటిషన్ ,ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సజ్ కేసులు, ల్యాండ్ కేసులు, కుటుంబ తగాదాలు, వాటర్ కేసులు, ప్రి లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మీనాదేవి, మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి కె.విజయ కళ్యాణి, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి బి.అప్పలస్వామి, ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.పద్మావతి, పోక్సో కోర్ట్ జడ్జి కె.నాగమణి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.దుర్గయ్య జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 'చెరుకూరి'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చెరుకూరి నాగరాజు (కుంకాల పండు) నియమితులయ్యారు. మంగళవారం స్థానిక మెసానిక్ టెంపుల్ వద్ద జరిగిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. అభినందన సభలో చెరుకూరి నాగరాజు మాట్లాడుతూ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా వైశ్యులకు అండగా ఉంటానని అన్నారు. పేద, మధ్య తరగతి సభ్యులందరికి మేలు జరిగే విధంగా చూస్తానని అన్నారు. ఈ సందర్భంగా నాగరాజుకు జిల్లా ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆలవెల్లి శేఖర్, డిమ్స్ రాజు, సముద్రాల నాగరాజు,జాయింట్ సెక్రటరీ పూసర్ల సాయి, హనుమాన్ శెట్టి నానాజీ, యువజన సంఘం అధ్యక్షులు ఆరిశెట్టి సంధీప్, కార్యదర్శి రాకేష్ తదితరులు అభినందనలు తెలిపారు.

పాత నేరస్థులపై నిఘా ప్రధానం : ఎస్‌పి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి ఎఆర్ దామోదర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నేరాలను నియంత్రించడంలో హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులు, పాత నేరస్థుల కదలికలపై పెట్టే నిఘానే ప్రధానమని ఎస్‌పి ఎఆర్ దామోదర్ అన్నారు. వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న పోలీసు అధికారులతో మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ దొంగతనం కేసు నమోదైన వెంటనే సంబంధిత పోలీసు అధికారులు సిసిఎస్ పోలీసుల సమన్వయంతో పనిచేసి, వాటిని ఛేధించేందుకు కృషి చెయ్యాలన్నారు. రాత్రి సమయాల్లో ఆర్టీసి కాంప్లెక్సులు, రైల్వే స్టేషన్లు, ముఖ్యమైన జంక్షన్లులో నిఘా పెట్టాలని, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వారి వేలిముద్రలను ఎంఎస్‌సిడిలతో తనిఖీ చేయాలన్నారు. నేరాల నియంత్రణకు మరిన్ని ఎక్కువ సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులను దేశించారు. హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులు, పాత నేరస్థుల ప్రస్తుత జీవన విధానాన్ని గమనిస్తుండాలని, వారికి కౌన్సిలింగు నిర్వహించే సమయంలో వారి ప్రవర్తన తీరును గమనించాలన్నారు. మారుతున్న నేరాలకు అనుగుణంగా పోలీసులు తమ వత్తి నైపుణ్యాలను పోలీసు అధికారులు, సిబ్బంది మెరుగుపర్చుకోవాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పి సౌమ్యలత, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, జి.భవ్య రెడ్డి, ఎన్.రాఘవులు, పలువురు సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు ప్రోత్సాహక నగదు బహుమతులు

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలలు, పోలీసు పిల్లలు, పోలీసు ఉద్యోగులకు వేరువేరుగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రోత్సాహక నగదు బహుమతులను ఎస్‌పి ఎఆర్ దామోదర్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం అందజేసారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ . 'లైంగిక వేధింపుల నుండి మహిళలు, పిల్లలను రక్షించడంలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రధమ స్థానంలో నిలిచిన వారికి రూ.2వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.1500, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.1000 చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేసామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ ఎవి లీలారావు, ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన కాంట్రాక్టర్ల ధర్నా

బకాయి బిల్లులు చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కాంట్రాక్టర్లకు రావాల్సిన బిల్లులు బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఎపి మున్సిపల్ కాంట్రాక్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా మంగళవారం రెండో రోజు కొనసాగింది. బిల్లులు చెల్లించాలని, కాలపరిమితి ముగిసిన బిల్లుల డిపాజిట్లు వెంటనే చెల్లించాలని, జిజిఎంపి బిల్లులు ఇప్పించాలని, ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్న బిల్లుల జాప్యాన్ని నివారించాలని, గత రెండేళ్లగా రావాల్సిన బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుకు అశోక్, లింగరాజు, అధ్యక్ష, కార్యదర్శులు బంగార్రాజు, రాజ్ కుమార్, దువ్వి.శ్రీనివాసరావు, మచ్చ సత్యన్నారాయణ, నరేంద్ర, శ్రీనివాసరాజు, సత్యన్నారాయణ, వాసు,రామారావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కాంట్రాక్టర్లు

సత్యా కళాశాల విద్యార్థులకు వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రా యూనివర్శిటీ ఇంటర్ కాలేజి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ లో సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. కాలేజ్ వెయిట్ లిఫ్టింగ్ టీమ్ మూడు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం సాధించి ఓవరాల్ టీం ఛాంపియన్‌షిప్ ట్రోఫీని పొందారు. వారిలో ఆర్. రాంబాబు (బిఎ థర్‌ఇయర్0 79 కేజీల విభాగంలో 105 కేజీల స్నాచ్ 135 కేజీల క్లీన్అండ్ జర్క్ చేసి బంగారు పతకం సాధించాడు. ఎ.యశశ్రీ (బిఎ ద్వితీయ సంవత్సరం) 63 కేజీల విభాగంలో 75 కేజీల స్నాచ్ 95 కేజీల క్లీన్ అండ్ జర్క్ చేసి బంగారు పతకం సాధించింది. టి.లావణ్య (బిఎ ప్రథమ సంవత్సరం) 58 కేజీల విభాగంలో 80 కేజీల స్నాచ్ 100 కేజీల క్లీన్ అండ్ జర్క్ చేసి బంగారు పతకం సాధించింది. ఎ.లిఖిత్ (బిఎస్‌సి ద్వితీయ సంవత్సరం) 65 కేజీల విభాగంలో 85 కేజీల స్నాచ్ 105 కేజీల క్లీన్ అండ్ జర్క్ చేసి కాంస్య పతకం సాధించాడు.వీరంతా డిసెంబర్‌లో జరగబోయే సౌత్ జోన్ వైట్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ లో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి మాట్లాడుతూ విద్యార్థులు కృషి, క్రమశిక్షణ, పట్టుదలతో ఈ విజయాన్ని సాధించారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరప నాయుడు, ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎం. ఉదయ్ కిరణ్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ యస్ హెచ్‌హెచ్. ప్రసాద్, కోచ్ చల్లా రాము పాల్గొన్నారు.

తైక్వాండో విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 1నుండి 2 వరకు ఏలూరు లో జరిగిన అండర్ 17 స్కూల్ గేమ్స్ తైక్వాండోలో జిల్లా క్రీడాకారులు నాలుగు బంగారు, రెండు రజిత, మూడు కాంస్య పథకాలు సాధించారు. ఈ సందర్భంగా డిఇఒ యు.మాణిక్యాల నాయుడును మంగళవారం విద్యార్థులు కలవగా విజేతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పార్కుల సంరక్షణకు సెక్యూరిటీ గార్డుల నియామకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పార్కుల సంరక్షణా బాధ్యత భద్రత సిబ్బంది (సెక్యూరిటీ గార్డులు) దేనని కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరంలోని ప్రధాన పార్కుల్లో భద్రత దృష్ట్యా కొంతమంది సిబ్బందిని నియమించారు. విధులు పట్ల కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వారిని కమిషనర్ మందలించారు. విధులు పట్ల నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని అన్నారు. పార్కుల్లో ఉన్న మొక్కల సంరక్షణా బాధ్యతను భద్రతా సిబ్బందే చూడాలన్నారు. సందర్శన వేళల్లో తప్పా మిగిలిన సమయంలో ఏ ఒక్కరినీ పార్కుల్లోకి అనుమతించవద్దని చెప్పారు.

పైడితల్లమ్మ దేవస్థానంలో అన్నదానం

విజయనగరం టౌన్ : పైడితల్లి అమ్మవారి పండగ అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అతిధి విజయలక్ష్మి గజపతిరాజు ప్రారంబించారు. మంగళవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వీకరించారు. ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ గాదె.శ్రీనివాసులునాయుడు, ఆలయ సహాయ కమిషనర్ శిరీష, పూజారులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, పలు కాలనీల ప్రజలు

కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఎల్‌బిజి నగర్, రామకృష్ణ నగర్, గురజాడ నగర్, వినాయక నగర్ కాలనీల్లో తాగునీరు, కాలువలు, రోడ్లు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్లకు వేస్తున్న రూ.51 పన్నులు కాకుండా రూ.1300 పన్నులు వేయడం సరికాదన్నారు. జీఓ ప్రకారం పన్నులు విధించాలన్నారు. ఎల్‌బిజి నగర్ లో అపార్ట్మెంట్ ల నుంచి వాడుక నీరు కాలనీలోకి వస్తోందని, కాలువలు నిర్మించి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గురజాడ, వినాయక్ నగర్లో తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బోర్లు వేసి నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రామకృష్ణ నగర్, ఎల్‌బిజి నగర్‌లో రోడ్లు, కాలువలు నిర్మించాలన్నారు. అనంతరం కమిషనర్ నల్లనయ్యకు వినతి పత్రం అందజేశారు. సిపిఎం నాయకులు పి.రమణమ్మ, శాంతమూర్తి, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర కమిటీలను, అనుబంధ కమిటీలను ఏర్పాటు చేసుకొని రానున్న ఎన్నికలలో గెలిపే లక్ష్యంగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు శాసనసభ మాజీ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. వైసిపి పట్టణ ప్రధాన కార్యదర్శిగా జామాన శ్రీనివాసరావు, పట్టణ వాణిజ్య విభాగ అధ్యక్షులుగా జమ్మూ మధు ఎంపికైనసందర్భంగా తన నివాసంలో కలిసిన వారికి కోలగట్ల శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిపక్ష పార్టీ అయినప్పటికీ కార్యకర్తలతో సత్సంబంధాలు కలిగి ఉండడమే కాకుండా వారి పట్ల అదే భావంతో ఉంటున్నామని గుర్తు చేశారు. ప్రజలకు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నడిపిల్లి ఆదినారాయణ, కణుగుల రాజా, పట్టా ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల విజేత విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఏలూరు జిల్లా కొవ్వూరులో ఈ నెల 1నుంచి 3 తేదీ వరకు జరిగిన అండర్ 17 వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలలో విజయనగరం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్ లో విశాఖపట్నం జట్టు పై గెలుపొందింది. విజేతగా నిలిచిన జిల్లా జట్టు క్రీడాకారులను, కోచ్‌లను జిల్లా విద్యా శాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు,స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి అభినందించారు.

అనుమతులు తప్పనిసరి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ పరిధిలో ఎటువంటి నిర్మాణాల కైనా, కట్టడాల కైనా ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అనికమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ప్రణాళిక విభాగం అధికారుల అనుమతి లేని నిర్మాణాలను, కట్టడాలను కూల్చివేస్తామని తెలిపారు. కొంతమంది అవగాహనా లోపంతోనూ లేక నిర్లక్ష్యంతోనో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వస్తుందన్నారు. ఈ తరహా నిర్మాణాలు చేపడుతున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

వైద్య కళాశాలను ప్రభుత్వ అధీనంలో ఉంచాలి : ఎంపిపి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని విజయనగరం ఎంపిపి మామిడి అప్పలనాయుడు అన్నారు. మంగళవారం దుప్పాడ గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారని, చంద్రబాబు సిఎం అయిన తరువాత వాటిని ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు.దీన్ని వైసిపి తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. డోల మన్మధ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే గ్రామీణ, పేద ,మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు. మండల పార్టీ అధ్యక్షులు కెల్ల త్రినాధ్ మాట్లాడుతూ వైద్య కళాశాలను ప్రైవేటీకరణ చేయొద్దని కోటి సంతకాల సేకరణ చేసి గవర్నర్‌కు పంపుతామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షునిగా మహంతి శ్రీనివాస్‌ను నియమిస్తూ నియామక పత్రం అందించారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గంగిరెడ్ల సూర్య ప్రకాష్, సర్పంచ్ ప్రతినిధి కరుమజ్జి రాములప్పడు, మాజీ సర్పంచ్ సైలాడ నేవీ రాజు, చందక పరశురాం తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ ఎందుకు రాలేదు?

అధికారులు ప్రోటోకాల్ పాటించరా? మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని చింతలవలస రైతులకు అన్నదాత సుఖీభవ ఎందుకు రాలేదని సభ్యులు అధికారులను ప్రశ్నించారు. అసలు అధికారులు ఎవరూ ప్రోటోకాల్ పాటించలేదని ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఎఒ టి.సంగీత మాట్లాడుతూ మండలంలో ఇటీవల వచ్చిన తుపానుకు 46 మంది రైతులకు చెందిన 50 ఎకరాలు వరి పంట నష్టం వాటిల్లిందని చెప్పారు. ఒక్క చొల్లంగి పేట గ్రామంలోనే 22 మంది రైతులకు చెందిన 16 ఎకరాల వరి పంట నష్టపోయిందన్నారు. డీకొల్లు సర్పంచ్ పట్టాడ శిరీషప్ప మాట్లాడుతూ యూరియా అవసరం ఉన్నప్పుడే సరఫరా చేయాలని అవసరం లేని సమయంలో యూరియాను సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరికి అవసరం జరిగినవని అన్నారు. వరి అనంతరం రైతులు మొక్కజొన్న వేస్తారని ఇప్పుడు కొంతమంది వేయడానికి సిద్ధంగా ఉన్నారని వారికి ముందుగానే యూరియా అవసరం ఉంది కాబట్టి ముందుగా తీసుకొచ్చి స్టోరేజ్ చేసి రైతులకు సకాలంలో అందించాలని కోరారు. తమ గ్రామానికి చెందిన రైతులు మూడు నాలుగు కిలోమీటర్లు దూరంలో ఉన్న చొల్లంగిపేట సచివాలయానికి వెళ్లి యూరియా వంటి వాటిని తెచ్చుకోలేకపోతున్నారని పంపిణీ తమ గ్రామంలోనే ఏర్పాటు చేయాలన్నారు. వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు మాట్లాడుతూ తమ స్వగ్రామం చింతలవలసలో 2019 నుంచి 2024 వరకు రైతులకు రైతు భరోసా డబ్బులు వచ్చాయని ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అన్నదాత సుఖీభవ డబ్బులు రైతులకు పడటం లేదని ఎఒను నిలదీశారు. ఈ సందర్భంగా స్పందించిన ఎఒ సంగీత మాట్లాడుతూ ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పెట్టామని కానీ వారికి ఎందుకు రాలేదో తెలియదని ఈ విషయాన్ని ఉన్నతాధికారులను అడిగి తెలుసుకుని చెబుతానని సమాధానం చెప్పారు. ఎపిఇ, హౌసింగ్ ఎఇ తమ నివేదికలను చదువుతుండగా వైస్ ఎంపిపి తమ్మినాయుడు కలుగజేసుకుని గ్రామాల్లో ఉన్న ప్రజాప్రతినిధులకు ఏ విషయమూ చెప్పడం లేదని ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజాప్రతినిధులకు తెలియపరచడం లేదని, తమకు నచ్చిన రాజకీయ పార్టీ నాయకులతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు.


అన్నదాత సుఖీభవపై ఎఒను నిలదీస్తున్న వైస్ ఎంపిపి తమ్మినాయుడు

దీనికి సభ్యులందరూ తమ్మినాయుడుకి మద్దతు పలికి అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని ఆగ్రహించారు. ఇప్పటికైనా అధికారులు పద్ధతి మార్చుకోవాలని కోరారు. ఎంపిపి వాసుదేవరావు మాట్లాడుతూ అధికారులందరూ తప్పనిసరిగా ప్రోటోకాల్ పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి కూరాకుల అనిత, ఎంపిడిఒ వై.భవాని, డిప్యూటీ తహశీల్దార్ సన్యాసినాయుడు, పలు శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు : డిడిఒ

రామభద్రపురం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అపారిశుధ్యం నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డివిజనల్ డవలప్ మెంట్ ఆఫీసర్ ఎం.కిరణ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం అరికతోట ప్రభావిత గ్రామాలు కొండకెంగువ, ఇట్లామామిడిపల్లిల్లో పర్యటించారు. ఇటీవల ఈ గ్రామాల్లో ఈ వ్యాధి తీవ్రతపై ప్రజాశక్తి లో వెలువడిన కథనాలకు స్పందించి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువల్లో పూడిక తీత పనులు పెద్ద ఎత్తున చేపట్టి బ్లీచింగ్ చల్లాలని సూచించారు. ప్రజలు కూడా అపారిశుధ్యం నిర్మూలనలో భాగస్వామ్యులు కావాలన్నారు. ప్రజలంతా కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. చెత్త నుంచి సంపద ఏ విధంగా సృష్టించాలనే దానిపై సచివాలయ ఉద్యోగులకు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఎస్ డబ్ల్యు పిసి పనితీరును పర్యవేక్షించారు. ఆరికతోట పిహెచ్‌సి వైద్యాధికారి అపర్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మరడాంలో పారిశుధ్య పనులు

దత్తిరాజేరు: మండలంలోని మరడాం గ్రామంలో మంగళవారం పారిశుధ్య పనులు చురుగ్గా చేపట్టినట్లు సర్పంచ్ పోతల శంకరరావు తెలిపారు. కాలువలలో పేరుకుపోయిన చెత్తను కార్మికులు తొలగించారు. గ్రామంలో ఎక్కడ చెత్త లేకుండా శుభ్రం చేసామని ఆయన వివరించారు. రోడ్డుమీద వేసిన మురుగు, తడి చెత్త ఆరిన తరువాత జెసిబి ద్వారా ట్రాక్టర్లతో చెత్త సంపద కేంద్రానికి తరలిస్తామన్నారు.

భవాని పీఠానికి రూ.30 వేలు సాయం

పూసపాటిరేగ: మండలంలోని పతివాడలో భవానీ పీఠం నిర్మానానికి కొవ్వాడ సర్పంచ్, జనసేన నాయకులు కోట్ల రఘు మంగళవారం రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు పతివాడ సర్పంచ్ ఆకులు పైడిరాము, పతివాడ వెంకటేష్, పతివాడ గౌరీశంకర్‌కు ఈ నగదు మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో ఉండాలన్నారు. ఈ గొప్ప కార్యక్రమంలో తాను భాగస్తుడిగా ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఆయనతోపాటు పలువురు భవానీలు ఉన్నారు.

మద్యం షాపుల తనిఖీ

వేపాడ: మండలంలోని పలు మద్యం షాపులను ఎక్సైజ్ ఎస్ఐ విఎన్ రాజు, సిబ్బంది మద్యం షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం బాటిళ్లను ఎంఆర్‌పి ధరలకే అమ్మాలన్నారు. ప్రతి షాపు వద్ద ఎమ్మార్పీ రేట్లు పట్టిక ఏర్పాటు చేయాలని, సమయపాలన పాటించాలని, 21 సంవత్సరాలు నిండినవారికే మద్యం అమ్మాలని సూచించారు. గొలుసు దుకాణాలకు ఏ షాప్ నుంచీ మద్యం సరఫరా చేయరాదని చెప్పారు. సంజీవమెట్ట, నల్లబెల్లి, వావిలిపాడు, చామలాదేవి అగ్రహారం, కెఆర్‌పేట, వేపాడ, వల్లంపూడి, దబ్బిరాజుపేట, గ్రామాలలో గొలుసు దుకాణాలపై దాడులు చేశారు. సిబ్బంది హెచ్‌సిపి వీర్రాజు, పిఅండ్ఇసి బి.హరి కిరణ్ పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న ఎస్ఐ రాజు

పాఠశాల సందర్శన

వేపాడ: మండలంలోని ఆకుల సీతంపేట పాఠశాలను ఎంఇఒ పి. బాలభాస్కరరావు మంగళవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, కిచెన్ గార్డెన్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు చదివించడం, డిక్టేషన్ పెట్టడం, చతుర్విధ ప్రక్రియలు చేయించడం, విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలన చేశారు. విద్యార్థులను ఎస్ఎ-1 పరీక్షలకు సంసిద్ధులు చేయాలని సూచించారు.

సహకార సంఘాల ద్వారా రుణాలు

రామభద్రపురం: మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రైతులకు అడిషనల్ ఫైనాన్స్ కింద రూ.25 లక్షల రుణాలు అందించనున్నామని బ్యాంకు చైర్ పర్సన్ చొక్కాపు విజయలక్ష్మి తెలిపారు. స్థానిక బ్యాంకు కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. 1బి, ఆధార్ ఉన్న రైతులకు ఎకరాకు రూ.70వేల చొప్పున ఈ రుణాలు మంజూరు చేయనున్నామని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కిమిడి నాగార్జున సహకారంతో ఈ నిధులు విడుదలయ్యాయన్నారు. ఈ ఏడాది రూ. 1.09 కోట్లు రుణాలను రెన్యువల్ చేశామన్నారు. సుమారు రూ.80 లక్షల డిపాజిట్లు సేకరించామన్నారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకుడు చొక్కాపు రామారావు పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

వేపాడ: మండలంలోని సోంపురం, అరిగిపాలెం గ్రామాలలో వైసిపి మంగళవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షులు మమ్ములూరి జగన్నాథం, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు వెంకటరావు పాల్గొని ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం కాకుండా కాపాడే ప్రయత్నంలో భాగంగా కోటి సంతకాల సేకరణను కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సోంపురం సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపిటిసి ఆకుల సత్తిబాబు, యువత అధ్యక్షులు ఉగ్గిన శ్రీను, అరిగిపాలెం ఎంపిటిసి తొండవరపు వెంకటరమణ, నాయకులు తొండవరపు మల్లేశ్వరరావు, నాయుడు బాబు పాల్గొన్నారు.

బాడాంలో సంతకాల సేకరణ

మెరకముడిదాం: మండలంలోని బాడాంలో మంగళవారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ శిరువూరు వెంకట రమణ రాజు(పెదబాబు), యువ నాయకులు బూర్లె నరేష్ కుమార్, పప్పల కృష్ణమూర్తి, సిరిపూరి కృష్ణమూర్తి రాజు, బుధ రాయవలస సర్పంచ్ సారికి తమ్మినాయుడు, బాడాం గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌కు లెండి విద్యార్థుల ఎంపిక

డెంకాడ: ఉత్తర కోస్తా ప్రాంతంలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఇన్ఫోసిస్ నియామక డ్రైవ్‌లో మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 143 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ సంస్థ ఈ డ్రైవ్‌ను అక్టోబర్ 16 నుంచి 18 తేదీ వరకు లెండి ఇనిస్టిట్యూట్‌లలో నిర్వహించింది. ఎంపికైన విద్యార్థులకు 3.60 లక్షల వార్షిక వేతనం ఎల్‌పిఎతో ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ మెగా ఈవెంట్‌లో విశేషంగా రాణించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి రామిరెడ్డి, డీన్ ట్రైనింగ్ ప్లేస్మెంట్ ఈ ప్రకాష్ బాబు, టీం హెచ్‌ఒడి తదితరులు అభినందించారు.

ఆదునిక వ్యవసాయంపై అవగాహన

ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, నిపుణుల సహాయంతో రైతులకు ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ (ఐపిఎం), సూక్ష్మ-నీటిపారుదల, వర్షపాత నీటిని మూటదాచే పద్ధతులు, సేంద్రీయ ఎరువులు, వర్మికంపోస్టింగ్ ప్రక్రియలు మొదలైన ముఖ్య అంశాల గురించి మంగళవారం అవగాహన కల్పించారు. 'కిసాన్ సువిధా' యాప్ వాడకం ద్వారా వాతావరణ సూచనలు, మార్కెట్ ట్రెండ్స్, నిపుణుల సల హాలు సమాచారాన్ని పొందే విధానం రైతులకు పరిచయం చేశారు.వాస్తవిక మైదానంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేంద్రీయ తెగులుపై నియంత్రణ పద్ధతులు ప్రదర్శిం చడంతో పాటు, భూమి పరీక్షలు నిర్వహించి, వర్మికంపోస్టింగ్ పద్ధతులు చూపించారు.

ఎపి రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక

శృంగవరపుకోట: ఎపి రైతు సంఘం ఎస్‌కోట మండల కమిటీని ఎన్నుకున్నామని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మండల కమిటీ ఎంపిక జరిగిందని చెప్పారు. ఇందులో ఎపి రైతు సంఘం మండల గౌరవ అధ్యక్షులుగా మంచిన రమణ, మండల అధ్యక్షులుగా జరత గౌరీష్, కార్యదర్శిగా గేదెల శ్రీను, ఉపాధ్యక్షులుగా అరుణ్‌కుమార్, బుర దయ్య ఎన్నికయ్యారని అన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల రైతు సంఘం జిల్లా కార్యదర్శి లోకవరపు ఆదినారాయణ పాల్గొని మాట్లాడారు. ఈ నెల 9న ఎస్‌కోటలో జరిగే జిల్లా రైతు సంఘం మహాసభ బాధ్యతను నూతన కమిటీకి అప్పగించగా మహాసభల విజయానికి నూతన కమిటీగా కృషి చేస్తామని తెలినట్లు రాంబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాటూరు రమణ, కాళ్ళ కృష్ణ, నాయుడు, మోపాడ రమణ పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు


విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి -గజపతినగరం

విద్యార్థులు బాగా చదువుకొని టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని డిఇఒ యు.మాణిక్యంనాయుడు అన్నారు. మంగళవారం మెంటాడ మండలం పోరాంలోని జెడ్‌పి ఉన్నతపాఠశాలను డిఇఒ పరిశీలించారు. ఈసందర్భంగా టెన్త్ విద్యార్థులతో మాట్లాడి సిలబస్ ఎంతవరకు అయ్యిందో తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడి సిలలబస్‌ను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు.గుడ్లు పాడైపోవడంతో వాటి స్థానంలో వేరే గుడ్లు వండాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన ఆహారం అందించాలని సూచించారు.

పనులు చేస్తే అడ్డుకుంటాం

శృంగవరపు కోట: జిందాల్ యాజమాన్యం కోసం ప్రభుత్వం తమ నుంచి సేకరించిన భూముల్లో ఎటువంటి పనులు చేపట్టినా అడ్డుకుంటామని సిపిఎం నాయకులు చల్లా జగన్ హెచ్చరించారు. బొడ్డవరలోని నిర్వాసితుల శిబిరం వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ తమ భూముల్లోకి తాము వెళితే పోలీసులు అడ్డుకోవడం అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. 137 రోజులుగా ఎటువంటి ఆటంకాలూ కలిగించకుండా శాంతియుతంగా తమ నిరసన తెలియజేస్తున్నామని ఇక నుంచి జిందాల్ యాజమాన్యం చేస్తున్న అన్ని పనులూ అడ్డుకుంటామని అన్నారు నిర్వాసితులను పట్టించుకోకుండా జిందాల్ యాజమాన్యం చేపడుతున్న మట్టి పనులు ఆపాలని చెప్పేందుకే ఇటీవల జిందాల్ కార్యాలయం వద్దకు మహిళలందరూ వెళ్ళారని అంత చిన్న సంఘటనకే పోలీసులు 18 మంది మహిళలను తీసుకెళ్లి నిర్బంధించడం సిగ్గుచేటు అని అన్నారు. భవిష్యత్తులో అన్ని రాజకీయ పార్టీల, అన్ని ప్రజాసంఘాల, దళిత గిరిజన సంఘాల మద్దతుతో అడ్డుకొని తీరుతామన్నారు.

రాష్ట్ర ఉత్తమ 'సెట్టర్'గా నవదీప్

జాతీయ స్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపిక

ప్రజాశక్తి - భోగాపురం



మండలంలోని రామచంద్రపేట గ్రామానికి చెందిన నవదీప్ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో నిర్వహించిన అండర్-17 వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్ర ఉత్తమ సెట్టర్ అవార్డును కైవసం చేసుకున్నాడు. తన అద్భుత ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్న నవదీప్, త్వరలో ఉత్తరప్రదేశ్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర తరపున ఎంపికయ్యాడు. 8వ తరగతిలోనే తోటి విద్యార్థులను చూసి వాలీబాల్ ఆడటం ప్రారంభించిన నవదీప్ ప్రస్తుతం రాణిస్తున్నాడు. తండ్రి అప్పల రెడ్డి తాపీ పని చేస్తుండగా, తల్లి మంగమ్మ కూరగాయలు అమ్ముతూ నవదీప్‌ను, తన చెల్లిని చదివిస్తున్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని ఒమ్ము చెయ్యకుండా ఇటు చదువులోనూ అటు ఆటల్లోను రాణిస్తున్నాడు. ఇంతకుముందు కూడా మూడుసార్లు రాష్ట్ర జట్టులో ఆడిన నవదీప్, ఇప్పుడు సీనియర్ నేషనల్స్‌లో ఆడి పోలీసు అధికారిగా ఎదగాలని సంకల్పంతో ఉన్నాడు. స్థానిక కొమ్మూరు అప్పడుదొర జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న నవదీప్‌ను ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, స్నేహితులు అభినందిస్తున్నారు. జాతీయ జట్టులో ఆడి ఉత్తమ ప్రతిభ కనబర్చి గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్రీడా స్ఫూర్తికి చేయూత

ప్రజాశక్తి- మెరకముడిదాం

చదువుతో పాటు ఆటలకు కూడా అత్యంత ప్రాధా న్యత ఇవ్వాలనే ఉద్దేశంతో హైదరాబాదు 'బాలమిత్ర ఫౌండే షన్', డెక్కన్ కెమికల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో మండలంలో ఉన్న తొమ్మిది ఉన్నత పాఠశాలలకు లక్ష రూపాయలు విలువ చేసే ప్రోత్సాహక స్పోర్ట్స్ మెటీరియల్‌ను మంగళవారం ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు. క్రీడాకారులు భవిష్యత్తులో రాష్ట్ర జాతీయ స్థాయిలో మెరిసి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఫౌండేషన్ ప్రతినిధులు ఆకాంక్షించారు. విద్యార్థులకు వాలీబాల్, చెస్, రింగులు, షటిల్ బ్యాట్స్, కాక్స్, స్కిప్పింగ్ తాళ్లు, వంటి నాణ్యమైన స్పోర్ట్స్ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా క్రీడల ద్వారా క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందించేందుకు కృషి చేస్తున్న బాలమిత్ర ఫౌండేషన్ ప్రతినిధులను అభినందిస్తూ పాఠశాలల ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిల్లల వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై సుచరిత, ఉపాధ్యాయ సిబ్బంది, సిఆర్ఎంటి రెడ్డి శంకర్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడా సామగ్రిని అందిస్తున్న ప్రతినిధులు

క్రీడా సామగ్రి పంపిణీ

వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలో గల మారిక గిరిజన గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 'మన నేస్తం మన వేపాడ' స్వచ్ఛంద సంస్థ సభ్యులు రూ.5,500 విలువగల క్రీడా సామాగ్రి అందించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మన నేస్తం మన వేపాడ స్వచ్ఛంద సంస్థ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గిరిజన యువకులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- రాజాం

విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరగనున్న సిఐటియు 18వ అఖిల భారత జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పొగిరిలో మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులను కట్టుబానిసలుగా మార్చటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయన్నారు. ఆశా వర్కర్లపైన యాప్స్ భారం మోపి ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. ఈ మధ్యకాలంలోనే వంగర మండలంలో ఆశా వర్కర్‌కు పని భారం ఎక్కువ అవ్వడంతో హార్ట్ ఎటాక్‌తో బస్సులో చనిపోయిందని గుర్తు చేశారు. సిఐటియు జాతీయ మహాసభ తొలిసారిగా విశాఖలో జరుగుతుందని, ఈ సందర్భంగా జనవరి 4న మహాప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ మహాసభ జయప్రదానికి కార్మికులు పెద్ద ఎత్తున కృషి చేయాలని ఆశా వర్కర్ సంఘం, విఆర్‌ఎ సంఘాలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తులసీరత్నం, సూర్యమని, రమణమ్మ, గౌరమ్మ, వీరమ్మ, విఆర్‌ఎ సంఘ నాయకులు వెంకటీ, రాము, కృష్ణ, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: సిఐటియు 18 మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ. జగన్మోహన్‌రావు, బి. రమణ పిలుపునిచ్చారు. మంగళవారం విజయనగరం అర్బన్ హెల్త్ సెంటర్లు, రాకోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్లను కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు యూనియన్ నాయకులు కనకమహాలక్ష్మి ,వాసవి ,పద్మ, వెంకటలక్ష్మి ,సునీత తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు సురేష్, ఆశావర్కర్స్

గజపతినగరం : గజపతినగరం మండల కేంద్రంలో సిఐటియు అఖిలభారత మహాసభలు పోస్టర్‌ను పంచాయతీ కార్మికుల నాయకులు గోవింద కృష్ణ, ఏసు, భాస్కరరావు విడుదల చేశారు. జనవరి 4వ తేదీన విశాఖ బీచ్ లో లక్షలాదిమంది కార్మికులు, ఉద్యోగులతో మహా ప్రదర్శన బహిరంగ సభ జరుగుతాయని ఈ బహిరంగ సభ ర్యాలీకి జిల్లాలోని కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపుపేట ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు శివుకు బంగారయ్య ఆర్థిక సహాయంతో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఉచితంగా 'గణిత ధీప్తి' స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ స్టడీ మేటిరాయల్‌ను జిల్లా ఉప విద్యాశాఖాధికారి కెవి. రమణ విద్యార్థులకు అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని, ఇలాంటి మెటీరియల్ సహాయంతో పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి' అని సూచించారు. హెచ్‌ఎం కామేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు గణిత మెటీరియల్‌ను పూర్తిగా వినియోగించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. గణిత ఉపాధ్యాయులు శివుకు బంగారయ్య మాట్లాడుతూ విద్యార్థులలో గణితంపై ఆసక్తి పెంచడం, వారికి పరీక్షలలో ఆత్మవిశ్వాసం కలిగించడం లక్ష్యంగా ఈ స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత సామరస్యంతో మెలగండి

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని బైరిపురంలో ఇటీవల గ్రామానికి చెందిన క్రైస్తవ మతస్థులు సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశ మందిరంలో రాత్రి వేళల్లో అధిక శబ్దంతో మైక్ సెట్లను వినియోగించడం వల్ల విద్యార్థులు పోటీ పరీక్షలకు చదవలేకపోతున్నారని, రైతులు పొలాల్లో కష్టపడి వచ్చి రాత్రి వేళల్లో ఈ శబ్ద కాలుష్యం వల్ల నిద్రలేమి రాత్రులు గడుపుతున్నారని అనుమతి లేని స్థలంలో గ్రామ నడిబొడ్డున ఈ సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేశారని బైరిపురం కొత్త వీధి, గర్భాం గ్రామస్తులు కొంతమంది తహశీల్దార్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో తహశీల్దార్ సులోచన రాణి, బైరిపురం విఆర్ఒ, బుధ రాయవలస ఎస్ఐ జె.లోకేష్ కుమార్ మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఉన్న ఇరు పక్షాలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్తులంతా మతసామరస్యాన్ని పాటించాలని, అందరూ కలిసిమెలిసి మెలగాలని సూచించారు. ఎస్ఐ లోకేష్ కుమార్ మాట్లాడుతూ అధిక శబ్దాలతో మైక్ సెట్లను వేయరాదని, మైక్ సెట్‌లు వేసేందుకు అనుమతులు తప్పనిసరి అని అన్నారు.

కంటి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చీపురుపల్లి

కళ్ళకు సంబంధించిన వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్, రెడ్ క్రాస్ అధ్యక్షులు డి ధర్మరాజు అన్నారు. మంగళవారం చీపురుపల్లి మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ, రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో సంయుక్తంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం వద్ద నిర్వహించిన మెగా నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నయనం ప్రధానం అనే పెద్దల నానుడికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ కంటిచూపు భద్రతను పాటించాలని స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా నిర్వహిస్తున్న నేత్ర వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. శిబిరంలో సుమారు 150 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 32 మందికి సస్త్ర చికిత్సలు అవసరం ఉన్నట్లు గుర్తించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు, విజయనగరంలోని పుష్పగిరి ఆసుపత్రి ఆప్తలామిక్ సిబ్బంది ద్వారా సస్త్ర చికిత్సలు జరిపి అవసరమైన కళ్ళజోలు కూడా పంపిణీ జరుపుతున్నట్లు ఆయన వివరించారు. శస్త్ర చికిత్సలు అవసరం లేని వారికి అవసరమైన కళ్ళజోళ్లను కూడా వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులకు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఇండియన్ రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్, మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బివి గోవిందరాజులు, విజయనగరం పుష్పగిరి ఆసుపత్రి పిఆర్ఒ నాగరాజు, ఆప్తాలమిక్ సిబ్బంది, సంస్థ ప్రతినిధి ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.


మందులు పంపిణీ చేస్తున్న తహశీల్దార్ ధర్మరాజు

మరుగుదొడ్లలో మీరు ఉండగలరా?

సోషల్ వెల్ఫేర్ డిడి అన్నపూర్ణమ్మ ఆగ్రహం

ప్రజాశక్తి - బొబ్బిలి

బాత్ రూములు, మరుగుదొడ్లలో మీరు ఉండగలరా అని ఎస్‌సి బాలుర కళాశాల హాస్టల్ సిబ్బందిపై సోషల్ వెల్ఫేర్ డిడి ఎ.అన్నపూర్ణమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌సి హాస్టల్ సమస్యలపై ప్రజాశక్తిలో సోమవారం కథనం రావడంతో కలెక్టర్ స్పందించి సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని డిడిను ఆదేశించారు. దీంతో మంగళవారం ఆమె హాస్టల్‌ను సందర్శించి పరిశీలించారు. బాత్ రూమ్‌లు, మరుగుదొడ్లు దుర్వాసన రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో ఒక్క వర్కర్ ఉండాల్సి ఉన్నప్పటికీ ముగ్గురు ఉన్నా ఎందుకు శుభ్రం చేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులు ఆరోగ్యంతో సంబంధం లేదా అని ప్రశ్నించారు. తీరులో మార్పు రాకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రహరీకి ప్రతిపాదనలు చేయాలని కోరారు. నాడు - నేడు పెండింగ్ పనులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎస్ఎస్‌డబ్ల్యుఒ ఆఫీసును మార్చాలని మెమో ఇచ్చిన ప్పటికి ఎందుకు మార్చలేదని ఎఎస్‌డబ్ల్యుఒ సత్యనారాయణను ప్రశ్నిం చారు. డైలీ మెనూ పోస్ట్ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యోగా ఎం దుకు చేపించడం లేదన్నారు. తీసుకుంటున్న జీతానికి న్యాయం చేయాలని కోరారు.


ఎఎస్‌డబ్ల్యుఒపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డిడి

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బల్లంకి గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం, రైతు అవగాహన శిబిరం నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ పాడిరైతులు, ఆడ పెయ్యలు మాత్రమే పుట్టే లింగ నిర్ధారిత వీర్య కణాలు ఉపయోగాన్ని పెంచాలని, పెయ్యలకు, పశువులకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులను పట్టాలని, ప్రభుత్వం 75శాతం సబ్సిడీపై సరఫరా చేసే పశు గ్రాస విత్తనాలను ఉపయోగించి పశుగ్రాస పెంపకాన్ని పెంచాలని సూచించారు. ఈ శిబిరంలో 36 పశువులకు గర్భకోశ వ్యాధులు, 32 పశువులకు సాధారణ వ్యాధులకు వైద్యం అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట సబ్ డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ చలపతిరావు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వాహణాధికారి డాక్టర్ రాధాకృష్ణ, వేపాడ, బొద్దాం పశు వైద్యులు డాక్టర్ గాయత్రి, డాక్టర్ అనిల్ కుమార్, వేపాడ పశువైద్యశాల సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ఘనంగా నిర్వహించారు. 11 స్కూల్స్ నుంచి విద్యార్థులు పాల్గొనగా సతివాడ ఎపి మోడల్ స్కూల్ ప్రథమ, జరజాపుపేట ఉనత్న పాఠశాల ద్వితీయ స్థానాలు సాధించాయి. ఇందులో జిల్లా స్థాయి చెకుమకి సైన్స్ పోటీలకు సతివాడ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆనంద్ మూర్తి, నెల్లిమర్ల చిన్న పిల్లలు డాక్టర్ కొత్తకోట శ్రీనివాస్, జెవివి జిల్లా ఉపాధ్యక్షులు కె. మురళి బాబు, దన్నాన ఈశ్వరరావు పాల్గొని విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు బహుమతులు అందజేశారు.


నెల్లిమర్ల: ప్రశంసా పత్రాలను అందుకుంటున్న విద్యార్థినులు

వంగర: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సైన్స్ టాలెంట్ టెస్టులో ఎనిమిది ఉన్నతపాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. కోనంగి పాడు, మరువాడ, అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు వరుస స్థానాల్లో విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో ఎంఇఒ మీసాల కూర్మినాయుడు, స్థానిక పాఠశాల ఇంఛార్జి హెచ్‌ఎం కాంబోతుల రమణ, పాల్గొన్నారు.

మెరకముడిదాం: సైన్స్ టాలెంట్ టెస్టులో గర్భాం ఎపి మోడల్ స్కూల్ జట్టు విజేతగా నిలిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఎంఇఒలు ఎం.చంద్రశేఖర్, టి. ధర్మశ్రీ సమక్షంలోనే పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లా స్థాయిలో జరుగనున్న చెకుముకి పోటీల్లో ఈ జట్టు పాల్గొబోతున్నట్లు జన విజ్ఞాన వేదిక బాధ్యులు రఘునాథరాజు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి, జనవిజ్ఞాన వేదిక బాధ్యులు రఘునాథరాజు, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మండల చిన్న వెంకటప్పలనాయుడు, మెరకముడిదాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శంబంగి తిరుపతిరావు, సైన్స్ ఉపాధ్యాయులు డి భూపతి, రమణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. ఈశ్వరరావు ఆధ్వర్యంలో సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించినట్లు జెవివి మండల కన్వీనర్ ఎల్. సత్యారావు తెలిపారు. మండలంలో 9 స్కూల్స్ విద్యార్థులు పాల్గొనగా ఎపి మోడల్ స్కూల్ ప్రథమ, జిందాల్ స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచాయి.

గరివిడి: గరివిడి గోదావరిదేవి షరాఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో టెస్ట్ పేపర్లను ఎంఇఒ డి.అప్పన్న, శ్రీరాం విద్యాపీఠ్ సెక్రటరీ బి.రవి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, కొండపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.రాము ఆవిష్కరించి పోటీలను నిర్వహించారు. 13 స్కూల్స్ నుండి 39 మంది విద్యార్థులు పాల్గొనగా మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి గోదావరి దేవి షరాఫ్ ప్రిన్సిపాల్ రవి బహుమతులు అదజేశారు. ఈ కార్యక్రమంలో వెదుల్లవలస ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జామి ఈశ్వరరావు, జెవివి మండల బాధ్యులు ఎ.సత్య శ్రీనివాసు, ఎవి కుసుమకుమారి, ఐక్య సత్యనారాయణ, ఉపాధ్యాయులు మౌళి, బంగారాజు, రమేష్ శంకరరావు, అప్పలనాయుడు, వెంకటరావు, బంగారు దొర, కూర్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.


కొత్తవలస: టాలెంట్ టెస్టులో పాల్గొన్న విద్యార్థులు

బొబ్బిలి: స్థానిక ఎస్ఎస్ఎస్ డిగ్రీ కాలేజీలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బొబ్బిలి మండలం, టౌన్‌లలో గల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలస్థాయి పరీక్ష పత్రాన్ని గ్రంథాలయ సంస్థల డైరెక్టర్ రౌతు రామమూర్తి, జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు కె.శివానంద్, ఉపాధ్యక్షులు పి.సత్యంనాయుడు, బొబ్బిలి ప్రధాన కార్యదర్శి శంబంగి శ్రీనివాస్, పిల్లా సత్యన్నారాయణ,శివశంకర, స్వామినాయుడు, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రెడ్డి కృష్ణమూర్తి ఆవిష్కరించారు. మండల స్థాయిలో పిరిడి, మహాత్మాజ్యోతిరావుపూలే, జిజిహెచ్ బాలికల, అభ్యుదయ హైస్కూల్ వరుస స్థానాల్లో విజయం సాధించాయి. అనంతరం కళింగవైశ్య పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు సౌజన్యంతో 8 వేల రూపాయలు విలువచేసే పుస్తకాలను విద్యార్థులకు అందించారు.